ఫార్మా విలేజ్ వద్దే వద్దు

- ప్రాణాలైనా ఇస్తాం కానీ సాగు భూములను ఇవ్వం
- ప్రభుత్వ నిర్ణయంపై భగ్గుమంటున్న కొడంగల్
- రైతుల ఆందోళనలు, కార్యాలయాల ముట్టడి
- కాలుష్య ఫార్మా కంపెనీలు వస్తే ఊర్లు ఖాళీ అవుతాయంటూ రైతుల ఆవేదన
- వికారాబాద్ జిల్లా దుద్యాలలో భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ

ఫార్మా విలేజ్ వద్దంటూ కేటీఆర్‌కు వివరిస్తున్న రైతులు (ఫైల్)

వికారాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ)/బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఏర్పాటు చేయ తలపెట్టిన ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా రైతుల ఉద్యమిస్తున్నారు. నెల రోజులుగా ప్రతిరోజూ కడా కార్యాలయంతోపాటు తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులు నిరసన వ్యక్తం చేస్తు న్నారు. 'ప్రాణాలైనా ఇస్తాం కానీ ఎన్నో ఏండ్లుగా మా కుటుంబాలు ఆధారపడిన భూములను మాత్రం ఇచ్చేది లేదు' అని తెగేసి చెప్తున్నారు. కాలుష్యం వెదజల్లే ఫార్మా కంపెనీలు వస్తే తమ బతుకులు ఆగం అవుతాయని, ముంబై, దుబాయ్‌లకు వలస పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తాము వేసిన ఓట్లతో సీఎం అయిన రేవంత్‌రెడ్డి.. తమను రోడ్డు పాలు చేస్తామంటే ఊరుకునేది లేదని, తగిన బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నారు. అసైన్డ్ భూములకు ఇచ్చిన విధంగానే పట్టా భూములకు కూడా అంతే నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో ఒప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టంచేస్తున్నారు. పట్టా భూములకు రెండింతలు అధికంగా నష్టపరిహారం ఇస్తామని స్థానిక అధికారులు సర్ది చెప్తున్నా శాంతించడం లేదు. జిల్లా కలెక్టర్ నుంచి గానీ, కడా అధికారి నుంచి కానీ అధికారికంగా ప్రకటన రాకపోవడంతో భూములిచ్చేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఫార్మా విలేజ్‌కు సేకరించే పట్టా భూములకు ఇచ్చే నష్టపరిహారంతోపాటు ఫార్మా విలేజ్‌తో ఎలాంటి కాలుష్య సమస్యలు ఏర్పడవని ప్రభుత్వం నుంచి స్పష్టమైన అధికారిక ప్రకటన వచ్చేంత వరకు భూములిచ్చేది లేదని, భూముల వద్దకు వస్తే ఊరుకునేది లేదని రైతులు హెచ్చరిస్తున్నారు.

ఆది నుంచీ అడగడుగునా వ్యతిరేకత

కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయంపై ఆది నుంచీ వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఫార్మా విలేజ్ కోసం హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల గ్రామాల పరిధిలోని 1,274.25 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టా భూములను సేకరించాలన్న నిర్ణయంపై రైతులు భగ్గుమంటున్నారు. తరతరాల నుంచి భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు కంపెనీల కోసం భూములిచ్చి తాము ఎలా బతకాలని నిలదీస్తున్నారు. ఫార్మా విలేజ్ వల్ల గ్రామాల్లో నీటి, వాయు కాలుష్యం పెరుగుతుందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, పంటలు పండే పరిస్థితి ఉండదని రైతులు భావిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫార్మా కంపెనీల కోసం సాగు భూములను ఇచ్చేది లేదని తెగేసి చెప్తున్నారు. ఇప్పటికే రైతులకు మద్దతుగా పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకోలు నిర్వహించారు. తమ గోడును కేటీఆర్, హరీశ్‌రావు దృష్టికి కూడా రైతులు తీసుకెళ్లారు. మూడు గ్రామాల రైతులు దుద్యాల తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీలు నిర్వహించగా, మంగళవారం పోలేపల్లి గ్రామానికి చెందిన ఒక మహిళా రైతు పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించారు.

703.65 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్

ఫార్మా విలేజ్‌పై రైతుల ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పోలేపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 67లో 130 ఎకరాలు, హకీంపేటలోని 252 సర్వే నంబర్‌లో 366 ఎకరాలు, లగచెర్లలో 102 సర్వే నంబర్‌లో 140 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ప్రభుత్వ భూమి సరిపోక పోవడంతో ప్రభుత్వ, పట్టా భూములను కలిపి మూడు గ్రామాల పరిధిలో మొత్తం 1274.25 ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. హకీంపేటలో 505.37 ఎకరాలు, పోలేపల్లిలో 130 ఎకరాలు, లగచెర్లలో 643 ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే లగచెర్ల గ్రామ పరిధిలోని 632.26 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాల పట్టా భూములను సేకరించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

మా భూములు మాకే ఉండాలి

ఫార్మా విలేజ్ మాకు వద్దే వద్దు. మా భూములు మాకే ఉండాలి. సాగు భూములను కంపెనీలకు ఇచ్చి మేమెలా బతకాలి. ఫార్మా కంపెనీల నుంచి వచ్చే కాలుష్యంతో మా ప్రాణాలకే నష్టం కలుగుతుంది.

-పుర్ర శ్రీమన్నారాయణ, మాజీ ఎంపీటీసీ పోలేపల్లి

రైతులను బజారు పాలు చేయొద్దు

ఫార్మా విలేజ్ కోసం సాగు భూములను లాక్కొని మమ్మల్ని బజారు పాలు చేయొద్దు. ఏడాదికి మూడు పంటలు పండించుకుని భూములనే నమ్ముకుని చాలామంది పేద రైతులు బతుకుతున్నారు. ఇప్పుడు అలాంటి భూములను కాలుష్యం వెదజల్లే ఫార్మా కంపెనీలకు ఇస్తే మేమంతా ఏం కావాలి.

-బోగమోని సురేశ్‌రాజ్, రైతు, లగచెర్ల.

ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్న రైతులు(ఫైల్)

కడుపు కొట్టొద్దు

భూములపైనే ఆధారపడి బతికే పేద రైతులం. వాటిని తీసుకుంటే మేం బతకలేము. భూములకు బదులుగా ఎన్ని రూ. లక్షలు ఇచ్చినా మాకు వద్దు. సాగు భూములను తీసుకుని రైతుల పొట్ట కొట్టొద్దు.. ఫార్మా కంపెనీ పెట్టి మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దు. ఫార్మా కంపెనీ వద్దని గతంలో కలెక్టర్‌తోపాటు కడా ప్రత్యేకాధికారికి, సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి కూడా చెప్పాం.

-కుమ్మరి శివకుమార్, హకీంపేట

కొండభీమనపల్లిలోని బీసీ గురుకుల పాఠశాలలో ఎలుకల దాడికి గురైన విద్యార్థులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ఇవేం గురుకులాలు? ఇంత అధ్వానమా?

- ఎలుకలు కరిచిన ఘటనపై మాజీ ఎమ్మెల్యే ఆరా
- వసతిగృహానికి వెళ్లి విద్యార్థులకు రవీంద్రకుమార్ పరామర్శ

దేవరకొండ రూరల్, ఆగస్టు 29 : గురుకులాల్లో పరిస్థితులు రోజురోజుకు దిగజారుతుంటే కాంగ్రెస్ సర్కార్ ఏం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ ప్రశ్నించారు. దేవరకొండ మండలం కొండభీమనపల్లి శివారులోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో 13 మంది విద్యార్థులను ఎలుకలు కరిచిన విషయం తెలుసుకున్న ఆయన గురువారం ఆ వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మెదక్ జిల్లాలోని గురుకులంలో, డిండి ఎస్సీ బాలిక గురుకులంలో, తాజాగా కొండభీమనపల్లి గురుకులంలో విద్యార్థులపై ఎలుకలు దాడి చేశాయన్నారు. గురుకులాల్లో పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంటే కాంగ్రెస్ సర్కార్ ఏం చేస్తుందని నిలదీశారు. ఓవైపు పాముకాట్లతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుంటే.. మరోవైపు కలుషిత ఆహారం తిని దవాఖాన పాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 8 నెలల కాలంలో 500 మందికి పైగా విద్యార్థులు దవాఖానపాలు కాగా, 36 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. గురుకులాల అధ్వాన పరిస్థితికి, విద్యార్థుల మరణాలకు విద్యాశాఖకు బాధ్యుడిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల మీద నోరు పారేసుకోవడంమాని పాలన మీద దృష్టి పెట్టాలని సూచించారు.

సీఎం, మంత్రుల మొద్దునిద్ర

- గురుకుల సమస్యలపై పట్టించుకోని పాలకులు
- బీఆర్‌ఎస్ నేతలు వాసుదేవరెడ్డి, బాలరాజుయాదవ్

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు మొద్దునిద్రలో ఉన్నారని బీఆర్‌ఎస్ నేతలు కే వాసుదేవరెడ్డి, బాలరాజుయాదవ్ ధ్వజమెత్తారు. హైడ్రా పేరిట ప్రజాసమస్యలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. గురుకులాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, రేవంత్ సర్కార్ ప్రభుత్వ గురుకుల వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నదని వాసుదేవరెడ్డి ఆరోపించారు. ఇప్పటివరకు 38 మంది గురుకుల విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా సీఎం, మంత్రులకు చీమ కుట్టినట్టయినా లేదని ఆరోపించారు. చాలా రోజుల నుంచి తాము గురుకులాల స్థితిగతుల గురించి హెచ్చరిస్తూనే ఉన్నామని తెలిపారు. ఇలా ఎంతకాలం విద్యార్థులు బాధపడాలని ప్రశ్నించారు. ప్రజాపాలన పడకేసిందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి గురుకులాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారని బాలరాజు యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయంలో గురుకులాలను కంటికి రెప్పలా కాపాడుకున్నారని తెలిపారు. రాష్ట్రానికి శనిలా రేవంత్ పాలన దాపురించిందని, ముందు ప్రజా సమస్యల పరిష్కారం గురించి ఆలోచించాలని హితవు పలికారు.

కాంగ్రెస్ పాలనకు గురుకులాలే నిదర్శనం

- సొంత శాఖపై సీఎం ఏంచేస్తున్నట్టు?
- విద్యార్థులను ఎలుకలు కరిచిన ఘటనపై హరీశ్ ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): గురుకుల విద్యార్థులు ఎలుకలు కరిచి దవాఖానల పాలవుతుంటే సీఎం ఏం చేస్తున్నారంటూ మాజీమంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన ఎట్లుందో చెప్పడానికి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న గురుకులాలే నిదర్శనమన్నారు. మొన్న రామాయంపేట గురుకుల పాఠశాలలో 12మంది విద్యార్థుల మీద, నిన్న నల్లగొండ జిల్లాలోని కొండభీమనపల్లి గురుకుల పాఠశాలలో 13 మంది విద్యార్థుల మీద ఎలుకల దాడి చేశాయని గురువారం ఎక్స్ వేదికగా హరీశ్ తెలిపారు. పాముకాటుకు గురై విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని, కలుషిత ఆహారం తిని, ఎలుకల కాటుకు గురై దవాఖానల పాలవుతున్నారని పేర్కొన్నారు. 8 నెలల కాలంలో 500 మం ది పైగా గురుకుల విద్యార్థులు దవాఖానల పాలయ్యారని, 36 మంది విద్యార్థులు ప్రా ణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న రేవంత్‌రెడ్డే బాధ్యుడని స్పష్టం చేశారు.

లోన్ యాప్ వేధింపులకు యువకుడి ఆత్మహత్యాయత్నం

ఓదెల, ఆగస్టు 29 : లోన్ యాప్ వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ కు చెందిన తూండ్ల శ్రీనివాస్ (27) లోన్ యాప్‌ల ద్వారా రూ.4 లక్షల వరకు రుణా లు తీసుకున్నాడు. కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్న అతడిని లోన యాప్ వాళ్లు ఫోన్లలో బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కొలనూర్ రైల్వే స్టేషన్ సమీపానికి వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఆ తర్వాత బంధువులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు కొలనూర్‌కు వచ్చి అతడిని మొదట సుల్తానాబాద్, అక్కడి నుంచి కరీంనగర్ దవాఖానకు తరలించారు. పూర్తిగా కాలిన శ్రీనివాస్ పరిస్థితి విషమంగానే ఉన్నట్టు బంధువులు తెలిపారు.

ఓటరు జాబితా ఆధారంగానే బీసీ రిజర్వేషన్లు

- కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ తిలోదకాలు
- అసెంబ్లీ తీర్మానం, 150 కోట్లు.. ఉత్త ముచ్చటే
- కాంగ్రెస్ మాట మార్చడంపై నిలదీస్తున్న బీసీ నేతలు
- 2న కలెక్టరేట్ల ముట్టడికి బీసీ సంఘాల పిలుపు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): బీసీ కులగణన చేపడతాం. రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతాం. అంటూ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హడావుడి చేసింది. సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహిస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసింది. రూ.150 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు సైతం జారీచేసింది. అదంతా ఉత్తముచ్చటేనని తేలిపోయింది. ఓటర్ల జాబితా ఆధారంగానే బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు సిద్ధమైంది. చిట్‌చాట్ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని స్పష్టంగా తెలియజేశారు. అంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఉత్త ముచ్చటేనని తేటతెల్లమైంది.

కులగణన రాష్ట్రం పరిధి కాదు

జనగణన 1948 చట్టం ప్రకారం జనాభా లెక్కల సేకరణ, కులగణన చేపట్టే అధికారం కేవలం కేంద్రానికి మాత్రమే ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే కులగణనకు చట్టబద్ధత లేక పోగా.. వాటిని అమలు చేసే అవకాశం కూడా లేదు. ఇటీవల బీహార్ రాష్ట్ర సర్కారు నిర్వహించిన కులగణన కోర్టుకెక్కింది. బీహార్ ప్రభుత్వం కులగణన నిర్వహించి ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల లెక్కలు తీసింది. వాటి ఆధారంగా రిజర్వేషన్లను 65 శాతానికి పెంచింది. ఈడబ్ల్యూఎస్ కోటా కలుపుకుంటే రిజర్వేషన్లు 75 శాతానికి పెరిగాయి. సుప్రీంకోర్టు గతంలో విధించిన 50 శాతం కోటా పరిమితిని మించిపోతున్నదని, బీహార్ ప్రభుత్వానికి కులగణన చేపట్టే అధికారాలు లేవని అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలువురు కోర్టుకెక్కారు. దీంతో రిజర్వేషన్ల అమలు మళ్లీ మొదటికి వచ్చింది.

అటకెక్కిన కులగణన

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా బీసీ కులగణన చేపడతామని, రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల అనంతరం పదేపదే ఈ అంశాన్ని పునరుద్ఘాటించారు. చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి చివరకు అసెంబ్లీలో తీర్మానం చేయడంతోనే కాంగ్రెస్ తన మోసపూరిత వైఖరిని బయటపెట్టుకుంది. ఆ తరువాత కులగణనకు రూ.150 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కులగణన నిర్వహణపై బీసీ కమిషన్‌కు ఎలాంటి మార్గదర్శకాలను జారీ చేయలేదు. ఇప్పుడు ఏకంగా ఓటరు జాబితా ఆధారంగానే రిజర్వేషన్ల స్థిరీకరణ చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం గమనార్హం.

ఓటరు జాబితా ప్రకారమే..

చాలా రాష్ట్రాలు ఓటరు జాబితా ఆధారంగానే రిజర్వేషన్లను స్థిరీకరించాయి. ఇప్పుడు అదే బాటలో నడిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మొగ్గు చూపుతున్నది. కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన తాజా ఓటరు జాబితాను అనుసరించి, గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. ఇందులో ఆయా యూనిట్ల వారీగా రాజకీయాల్లో ఆయా బీసీ వర్గాల ప్రాతినిధ్యం ఆధారంగా రిజర్వేషన్లను స్థిరీకరించనున్నారు.

ఒడిశా తరహాలోనే..

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ ఓటరు జాబితా ఆధారంగా బీసీల రిజర్వేషన్లను స్థిరీకరించాయి. బీహార్, కర్నాటక సమగ్ర కులసర్వేలను నిర్వహించాయి. వాటి ఆధారంగా బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించేందుకు కసరత్తు చేస్తున్నాయి. ఒడిశా ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను రద్దు చేసి, వాటన్నింటినీ జనరల్ స్థానాలుగా మార్చింది. అయితే బీసీలకు పార్టీ పరంగా 50 శాతం టిక్కెట్లను కేటాయించింది. ఇప్పుడు ఇక్కడ కాంగ్రెస్ సర్కార్ సైతం అదే ఎత్తుగడను అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. బీసీ కమిషన్‌ను నియమించి, రిజర్వేషన్లను 23 శాతంగా స్థిరీకరించాలని, మిగిలిన 19 శాతం రిజర్వేషన్‌ను పార్టీ పరంగా టిక్కెట్లు కేటాయించి, తద్వారా 42 శాతం హామీని నిలబెట్టుకోవాలనే చూస్తున్నట్టు తెలుస్తున్నది. దీనిపై రాజకీయవర్గాల్లో జోరుగా ప్రచారం కొనసాగుతున్నది. తాజాగా ఓటరు జాబితా ద్వారా రిజర్వేషన్ల స్థిరీకరణ అని సీఎం ప్రకటించడంతో అదే విషయం తేటతెల్లమవుతున్నది.

నిలదీస్తున్న బీసీ సంఘాలు..

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయాలని రాష్ట్రంలోని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమగ్ర కులగణన నిర్వహించి, బీసీలకు ఉపకులాల వారీగా రిజర్వేషన్లు కల్పించిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని అల్టిమేటం జారీ చేస్తున్నాయి. గతంలో మాదిరిగానే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం పూనుకుంటే తీవ్రస్థాయిలో పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నాయి.

2న బీసీ సంఘాల కలెక్టరేట్ల ముట్టడి

రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ రెండున రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముట్టడి చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను దొమలగూడలోని బీసీ భవన్‌లో గురువారం ఆవిష్కరించారు సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత ఒకమాట చెప్తుంటే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరోవిధంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలకతంగా సమస్త బీసీ సమాజం ప్రత్యక్షంగా పాల్గొని కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి తర్వాత లక్ష మందితో హైదరాబాదును దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన శ్రీనివాస రాజు

మేడ్చల్ కలెక్టరేట్‌లో ఏసీబీ దాడి

లక్ష లంచం తీసుకుంటుండగా పట్టుబడిన అసిస్టెంట్ రిజిస్ట్రార్

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 29: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడి అరెస్టు అయ్యాడు. జిల్లాకు చెందిన నవభారత్ కో-ఆపరేటివ్ బ్యాంకు అధికారులు, ఖాతాదారులకు ఇటీవల వివాదం చోటుచేసుకున్నది. ఖాతాదారులు తమ సమస్యను పరిష్కరించాలని జిల్లా కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీ శ్రీనివాసరాజును 24న ఆశ్రయించారు. సమస్యను పరిష్కరించేందుకు రూ.5 లక్షల లంచం ఇవ్వాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్ డిమాండ్ చేశాడు. రూ.లక్ష ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. ఏసీబీ అధికారులను ఆశ్రయించిన ఖాతాదారులు గురువారం కలెక్టరేట్‌లోని ఆ అధికారిని కలవగా, తన కారులో ఆ లంచం సొమ్ము పెట్టాలని చెప్పాడు. ఖాతాదారులు ఆ డబ్బును కారులో పెట్టగానే, పథకం ప్రకారం ఏసీబీ అధికారులు వచ్చి అనంతరం అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరాజును అదుపులోకి తీసుకొని, సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

• తాగునీటి కోసం మహిళల ఆందోళన

భూపాలపల్లిలోని కారల్ మార్క్స్ కాలనీ 25వ వార్డులో తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో మహిళలు ధర్నా నిర్వహించారు. తాగు నీటి సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నాయకులు సతీష్, ప్రవీణ్ తెలిపారు.- భూపాలపల్లి రూరల్

• సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతన్న

వరద కాల్వకు నీళ్లివ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై 8 గ్రామాల రైతులు రాస్తారోకో చేశారు. 28 రోజుల క్రితం మంత్రులు వరద కాల్వ నీటిని విడుదల చేసినా నేటికీ చివరి భూములకు నీరందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాడ్గులపల్లి, దాచారం, చెరువుపల్లి, ఇందుగుల, మర్రిగూడెం, తోపుచర్ల గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ఆవేదనచెందారు. – మాడ్గులపల్లి

• ఓసీ-3 వద్ద కొండంపల్లి గ్రామస్థుల ధర్నా

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం ధర్మరావుపేట శివారులోని ఓసీ-3 వద్ద కొండంపల్లి గ్రామస్థులు గురువారం ధర్నా నిర్వహించారు. తమ పిల్లలకు ఉపాధి, ఉద్యోగాలు వస్తాయనే ఆశతో విలువైన పంట భూములను సింగరేణి యాజమాన్యానికి అందిస్తే వారి భవిష్యత్‌ను అంధకారం చేస్తున్నదని వారు మండిపడ్డారు. – గణపురం

• కొనసాగుతున్న బీసీ డిక్లరేషన్ దీక్ష


బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని వరంగల్ జిల్లా గీసుగొండలో రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమారస్వామి చేపట్టిన నిరాహార దీక్ష గురువారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నది. ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ భిక్షపతి, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్, బీఆర్‌ఎస్ నాయకుడు సాంబారి సమ్మారావు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. – గీసుగొండ

కారుణ్య నియామకాలు చేపట్టాలి: టీఎన్జీవో

హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): జిల్లా పరిషత్‌లలో పని చేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించాలని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించాలని కోరారు. 2016లో దరఖాస్తు చేసుకున్న వారికి సైతం ఉద్యోగాలివ్వలేదని, వీరికి జిల్లా పరిషత్ వివిధ కార్యాలయాల్లో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. బాధితులు గురువారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో అసొసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, నాయకులతో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.


టీఎన్జీవో భవన్‌లో మారం జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : టూరిజం సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం సీఎం నివాసంలో ఎమ్మెల్యే సాంబశివరావుతో కలిసి యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజమౌళి వినతిపత్రాన్ని సమర్పించారు.

కరీంనగర్ జిల్లా గుండ్లపల్లిలో ఎమ్మెల్యే కవ్వంపల్లిని అడ్డుకున్న గ్రామస్థులు

ఎమ్మెల్యే కవ్వంపల్లికి నిరసన సెగ

గన్నేరువరం, ఆగస్టు 29: కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు నిరసన సెగ తగిలింది. గుండ్లపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న ప్రాంతాన్ని ఒక గ్రామంగా, లోపలి వైపు ఉన్న ప్రాంతాన్ని మరో గ్రామంగా విభజిస్తున్నారన్న సమాచారం మేరకు వారు ఆయన్ను నిలదీశారు. దీంతో చేసేదేమీ లేక ఎమ్మెల్యే అక్కడి నుంచి తిరిగి వెళ్తుండగా స్థానిక కాంగ్రెస్ నాయకులు కలుగజేసుకొని గ్రామస్థులకు సర్ది చెప్పించారు. ఎమ్మెల్యేను తీసుకొచ్చి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి శంకుస్థాపన చేయించారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. గ్రామాన్ని విభజించకుండా తనవంతు ప్రయత్నం చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.